RNI No: APTEL /25/A2860

సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 122 | పేజీలు : 4 | బుధవారం 4 నవంబర్ 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



హైదరాబాద్ మెట్రోకు నిధుల జోరు.. ఫేజ్-2కు రూ.150 కోట్లు



కరవు కష్టాల నుంచి రైతన్నను గట్టెక్కించండి

కేంద్ర బృందానికి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి

కరవు పరిస్థితులపై కేంద్ర బృందంతో సీఎం చంద్రబాబు సమావేశం

రాష్ట్రానికి ప్రత్యేక సాయం అందించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి

వీబీ జీ రామ్ జీ పథకం పనిదినాలు 200కి పెంచాలని కోరిన సీఎం

కరవు బాధితులకు డ్రాట్ కార్డులు, జేజేఎం విస్తరణకు సహకరించాలని వినతి

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులతో వ్యవసాయ రంగం కుదేలైన నేపథ్యంలో, రైతులను, ప్రజలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. రాష్ట్రంలో కరవు తీవ్రతను అంచనా వేసేందుకు పర్యటించిన కేంద్ర అంతర మంత్రిత్వ శాఖల బృందం (ఐఎంసీటీ) బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం చేపడుతున్న ఉపశమన చర్యలను సీఎం వారికి సమగ్రంగా వివరించారు. రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితులను కేంద్ర బృందానికి వివరిస్తూ, “ఒకవైపు తీరప్రాంతం తుఫాన్లతో నష్టపోతుంటే, మరోవైపు రాయలసీమ, ఇతర ప్రాంతాలు ఎల్ నినో ప్రభావంతో తీవ్ర కరవు కోరల్లో చిక్కుకున్నాయి” అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది సాధారణం కంటే అత్యంత తక్కువ వర్షపాతం నమోదు కావడం వల్ల ఖరీఫ్ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని, సాగునీటితో పాటు తాగునీరు, పశుగ్రాసానికి కూడా తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. దేశంలోనే రెండో అత్యల్ప వర్షపాతం నమోదైన ప్రాంతంగా అనంతపురం జిల్లా నిలిచిన విషయాన్ని ఆయన బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే రాష్ట్రంలోని 21 జిల్లాల్లో 412 మండలాలను కరవు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించామని, పంట నష్టాలపై పూర్తిస్థాయి అంచనాలతో వారం రోజుల్లో కేంద్రానికి నివేదిక సమర్పిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కరవు పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ఉపాధిని, వ్యవసాయాన్ని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి కొన్ని కీలక ప్రతిపాదనలు చేశారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి క్షేత్రస్థాయిలో మానవ వనరుల అవసరం ఎక్కువగా ఉంటుందని, ఈ నేపథ్యంలో ‘వీబీ జీ రామ్ జీ’ - మిగతా3లో



ఉదయం 11 గంటలకే ఆయన నోటి నుంచి మద్యం వాసన వచ్చేది

- భగవంత్ మాన్‌పై రాహుల్ గాంధీ తీవ్ర వ్యక్తిగత విమర్శలు
- రోజూ మద్యం సేవించే సీఎం డ్రగ్స్‌పై పోరాడలేరని వ్యాఖ్య
- పంజాబ్ పాలన కేజ్రీవాల్, అమిత్ షా చేతుల్లో ఉందని ఆరోపణ
- రాష్ట్రంలో పరిశ్రమలు పెరిగితేనే యువతకు ఉపాధి లభిస్తుందని సూచన
- ప్రధాని మోదీతో చర్చకు తాను సిద్ధమంటూ మరోసారి సవాల్

ఢిల్లీ నాయకుల ముందు

రాష్ట్ర నేతలు వణికిపోతున్నారు



- కేటీఆర్ ఘాటు విమర్శలు
- కాంగ్రెస్, బీజేపీలపై కేటీఆర్ ఘాటు విమర్శలు
- కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ, బీజేపీ చెప్పులు మోసే పార్టీ అంటూ ఘాటు వ్యాఖ్యలు
- తెలంగాణకు కేంద్రం ఏం ఇచ్చిందని అమిత్ షాను ప్రశ్నించిన కేటీఆర్
- రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలపై విమర్శలు

స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభంజనం..

సీఎం చంద్రబాబును కలిసిన పల్లా


మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి ఘన విజయం

సీఎం చంద్రబాబును కలిసి అభినందనలు తెలిపిన పల్లా శ్రీనివాసరావు

అభివృద్ధి, సంక్షేమ పాలనకే ప్రజలు మద్దతిచ్చారని వెల్లడి

ఈ తీర్పుతో తమపై బాధ్యత మరింత పెరిగిందన్న పల్లా





కండక్టర్ ప్రవళిక కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం

ప్రయాణికురాలి దాడిలో గాయపడిన మహిళా కండక్టర్ ప్రవళిక మృతి

మృతురాలి తల్లికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని పొన్నం హామీ

ఉస్మానియా మార్చురీ వద్ద ప్రవళిక మృతదేహానికి నివాళి అర్పించిన మంత్రి

ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి

డబుల్ ధమాకా!

2,21,500 ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తి

మరో 1.90 లక్షల ఇళ్లు నిర్మాణ దశలో

ఐదు నగరాల్లో జీ+5 ఇందిరమ్మ టవర్లు

రూ.40 వేల కోట్లతో ఇళ్ల నిర్మాణం

2.21 లక్షల కుటుంబాల్లో పండుగ వెలుగులు.. ‘మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి’కి శ్రీకారం

హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లలో ఈ దీపావళిని ప్రత్యేకంగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఇప్పటికే గృహప్రవేశాలు పూర్తయిన ఇళ్లలో ‘మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి’ పేరుతో వేడుకలు నిర్వహించాలని సూచించారు. లబ్ధిదారులతో పాటు ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. పేదల ఇళ్లలో వెలిగే ప్రతి దీపం ప్రజా ప్రభుత్వ సంకల్పానికి ప్రతీకగా నిలవాలని పేర్కొన్నారు. బుధవారం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కేంద్రంలో ఐటీ శాఖ మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి - మిగతా3లో



డెమొక్రాట్లతో కలిసి పనిచేస్తా

ఎన్నికల ఫలితాలతో స్వరం మార్చిన ట్రంప్

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లకు ఘోర పరాజయం

హౌస్, సెనెట్ రెండింటినీ కైవసం చేసుకున్న డెమోక్రాట్లు

ఫలితాల తర్వాత దిగొచ్చిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

అమెరికా

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ఓటర్లు రిపబ్లికన్ పార్టీకి గట్టి గుణపాఠం చెప్పారు. ఎన్నికల ఫలితాలకు ముందు వరకు డెమోక్రాట్లు ప్రవేశపెట్టే ప్రతీ బిల్లును వీటో చేస్తానని గర్జించిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఘోర పరాజయం తర్వాత అనూహ్యంగా స్వరం మార్చారు. దేశ శ్రేయస్సు కోసం డెమోక్రాట్లతో కలిసి పనిచేయడానికి సిద్ధమని ప్రకటించారు. “ఈ ఎన్నికల్లో నేను బ్యాలెట్‌పై లేను, ఒకవేళ ఉండుంటే మేము భారీ మెజారిటీతో గెలిచేవాళ్లం” అని వ్యాఖ్యానించారు ఈ ఎన్నికల్లో - మిగతా3లో

బుధవారం 4 నవంబర్ 2026

సీమ వార్త సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

ఓటుకు వచ్చే....కార్మికులకు వేతనంతో కూడిన సెలవు..!!

....జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్.

పుట్టపర్తి, నవంబర్ 04 సీమ వార్త సాయంత్రం.




శ్రీ సత్యసాయి జిల్లాలో 2026 సంవత్సరానికి సంబంధించి జడ్పిటిసి మరియు ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణలో భాగంగా నవంబర్ 5 న పోలింగ్ రోజు శ్రీ సత్యసాయి జిల్లాలోని అన్ని పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని సంబంధిత ప్రైవేటు మరియు ప్రభుత్వ పరిశ్రమల యాజమాన్యాల వారు... వారి పరిశ్రమలో పనిచేసే కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వవలసిందిగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

.....పెనుకొండ మున్సిపాలిటీ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తాం: మంత్రి పి. నారాయణ.

....మంత్రి నారాయణకు స్వాగతం పలికిన మంత్రి సవితమ్మ

.....మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లకు అభినందనలు తెలిపిన మంత్రి నారాయణ.

.... పాల్గొన్న... పెనుగొండ నియోజకవర్గ అబ్జర్వర్ నరసింహారావు.





గెలుపు ప్రజల... నమ్మకాన్ని నిలబెట్టేలా ఉండాలి..!!

పెనుకొండ నవంబర్ 4 సీమ వార్త సాయంత్రం.

పెనుకొండ మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించిన నేపథ్యంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ బుధవారం పెనుకొండలోని మంత్రి సవితమ్మ క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ త్రివేంద్ర నాయుడుతో పాటు కౌన్సిలర్లను ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి పి. నారాయణ మాట్లాడుతూ.. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, ప్రతి వార్డులోని సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. పెనుకొండ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి సవితమ్మతో కలిసి రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలు, ఎన్నికల కార్యాచరణపై సమాలోచనలు జరిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు నరసింహారావు, ఎన్నికల పరిశీలకులు సోమశెట్టి వెంకటేశ్వర్లు, పెనుకొండ మున్సిపల్ చైర్మన్ త్రివేంద్ర నాయుడు, కౌన్సిలర్లు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.







సేంద్రియ ఆహార పదార్థాలతో.... సుస్థిర జీవన శైలి..!!

....సుస్థిర ఆహార విధానాలపై అవగాహన.

.....సేంద్రియ, చిరుధాన్యాల ఆహార ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాల కార్యక్రమం.

....శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్





పుట్టపర్తి, నవంబర్ 04: సీమ వార్త సాయంత్రం.

పుట్టపర్తిలోని మామిళ్లకుంట వద్ద గల ప్రజా సమస్యల పరిష్కార వేదిక హాల్, రెవెన్యూ భవన్‌లో బుధవారం ఉదయం 10.00 గంటల నుంచి సుస్థిర ఆహార విధానాలపై ప్రత్యేక అవగాహన, ప్రదర్శన మరియు విక్రయాల కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖల మార్గదర్శకాల మేరకు, మిషన్ లైఫ్ లోని ఏడు ప్రధాన అంశాల ఆధారంగా ప్రజలు, గ్రామీణ స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వాములను చేస్తూ, 2026 నవంబర్ 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా "బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారం" నిర్వహిస్తున్నారు. - మిగతా3లో

జనం మెచ్చిన విజేతలకు జేజేలు..!!

.....విజయోత్సవ సభ జరుపుకున్న కూటమి నాయకులు : ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

పాల్గొన్న... ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, గుమ్మనూరు నారాయణస్వామి,రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ పత్తి హిమబిందు, జనసేన వాసగిరి మణికంఠ.

గుంతకల్లు నవంబర్ 4 సీమ వార్త సాయంత్రం.

గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎన్నికల్లో గెలుపొందిన విజయతలను అభినందిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ స్థానిక మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా గుంతకల్లు పట్టణం మున్సిపల్ చైర్మన్ గా యశోద 6557 ఓట్లు మెజార్టీ విజయం సాధించడం శుభాకాంక్షలు తెలిపారు. అలాగే గుంతకల్లు పట్టణం - మిగతా3లో

ఆటంకాలు లేకుండా... ఎలక్షన్ పూర్తి కావాలి..!!

.....ఓడీసీలో ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలించిన....జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్.

ఓబులదేవరచెరువు,నవంబర్, 04: సీమ వార్త సాయంత్రం.

మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ కోసం ఓడీసీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అత్యంత పారదర్శకంగా మరియు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, పత్రాలు మరియు ఇతర ఎన్నికల మెటీరియల్‌ను సక్రమంగా వర్గీకరించి అందుబాటులో ఉంచాలి. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, సిసిటీవీ కెమెరాల నిఘా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బంది మరియు అధికారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, విద్యుత్,ప్రాథమిక వైద్య సదుపాయాలను సిద్ధం చేయాలని సూచించారు. పోలింగ్ సామగ్రి పంపిణీ సమయానికి పూర్తయి, సిబ్బంది నిర్దిష్ట వేళకు తమ కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకునేలా పక్కా ప్రణాళికతో వ్యవహరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో ఏఆర్ఓ రాజేంద్ర కుమార్ రెడ్డి,ఓడీసీ తహశీల్దార్ శ్రీనివాసులురెడ్డి,ఎమ్ పిడిఓ పాల్గొన్నారు.



సీమ వార్త సాయంకాలం
బుధవారం 4
నవంబర్ 2026

ఉదయం 11 గంటలకే ఆయన నోటి నుంచి మద్యం వాసన వచ్చేది

పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో వ్యక్తిగత విమర్శలు చేశారు. ఆయనకు మద్యపానం సేవించే అలవాటు ఉందని, అలాంటి వ్యక్తి రాష్ట్రంలో మాదకద్రవ్యాల సమస్యను ఎలా పరిష్కరించగలరని ప్రశ్నించారు. సంగ్రూర్‌లో బుధవారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'ఇన్సాఫ్ ర్యాలీ'లో పాల్గొన్న రాహుల్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గతంలో తాను, భగవంత్ మాన్ లోక్‌సభ సభ్యులుగా ఉన్నప్పటి సంఘటనను రాహుల్ గుర్తు చేసుకున్నారు. "ఉదయం 11 గంటలకే ఆయన నోటి నుంచి మద్యం వాసన వచ్చేది" అని సంచలన ఆరోపణ చేశారు. మద్యం సేవించడం ఆయన వ్యక్తిగత విషయం కావొచ్చని, కానీ ప్రతిరోజూ మత్తులో ఉండే ముఖ్యమంత్రి మాదకద్రవ్యాల వల్ల కలిగే బాధను ఎలా అర్థం చేసుకోగలరని నిలదీశారు. పంజాబ్‌కు డ్రగ్స్ సమస్యపై నిజంగా బాధపడే నాయకుడు అవసరమని అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం పంజాబ్‌ను



పాలించడం లేదని, రాష్ట్రాన్ని ఢిల్లీ నుంచి నడిపిస్తున్నారని రాహుల్ ఆరోపించారు. "పంజాబ్ పాలనను సగం అరవింద్ కేజ్రీవాల్, మరో సగం కేంద్ర హోంమంత్రి అమిత్ షా నడుపుతున్నారు. భగవంత్ మాన్ కేవలం అక్కడ కూర్చుంటున్నారు అంతే" అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పంజాబ్ నుంచే పాలన అందిస్తామని స్పష్టం చేశారు. మూడేళ్లలో డ్రగ్స్‌ను అంతం చేస్తానన్న అమిత్ షా వ్యాఖ్యలను కొట్టిపారేసిన రాహుల్, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అంతకాలం కొనసాగకపోవచ్చని అన్నారు. గతంలో పంజాబ్‌లో మాదకద్రవ్యాల సమస్య పెరిగిపోతోందని తాను హెచ్చరించినప్పుడు బీజేపీ, అకాలీదళ్ తన మాటలను పట్టించుకోలేదని రాహుల్ గుర్తుచేశారు. రాష్ట్రంలో డ్రగ్స్, గ్యాంగ్‌స్టర్ సంస్కృతిని నిర్మూలించాలంటే పరిశ్రమలు, ఫ్యాక్టరీలు స్థాపించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి రాహుల్ గాంధీ మరోసారి సవాల్ విసిరారు. మోదీతో ముఖాముఖి చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, కేవలం ఐదు నిమిషాల్లోనే మోదీ ఒక "దేశద్రోహి" అని, ఆయన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేతిలో కీలుబొమ్మ అని నిరూపించగలనని అన్నారు.

ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారు

కాంగ్రెస్, బీజేపీ రెండూ తెలంగాణకు అన్యాయం చేస్తున్న పార్టీలేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ అయితే.. బీజేపీ చెప్పులు మోసే పార్టీ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అమిత్ షా హైదరాబాద్‌కు వస్తే బండి సంజయ్ బాడీగార్డ్‌లా వ్యవహరించారని కేటీఆర్ విమర్శించారు. ప్రియాంక గాంధీ భద్రతా సిబ్బంది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పక్కకు నెట్టేశారని ఆరోపించారు. కేంద్ర మంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్ కరీంనగర్ ప్రజల గౌరవాన్ని దిగజార్చవద్దని హితవు పలికారు. తనకంటే చిన్నవాడైన అమిత్ షాకు రాంచందర్‌రావు కాళ్లకు నమస్కరించడమేంటని ప్రశ్నించారు. అమిత్ షా తెలంగాణకు వచ్చి చేతులు ఊపుకుంటూ వెళ్లిపోయారని, రాష్ట్రానికి ఏం ఇచ్చారని కేటీఆర్ నిలదీశారు. ఒక్క మెట్రో ప్రాజెక్టు, జాతీయ ప్రాజెక్టు లేదా విద్యాసంస్థనైనా మంజూరు చేశారా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి తరచూ ఢిల్లీ పర్యటనలు చేస్తూ రాజకీయ ప్రయోజనాల కోసమే తాపత్రయపడుతున్నారని విమర్శించారు. వారానికి రెండుసార్లు ఢిల్లీకి వెళుతూ ఆయన 'ఈఎంఐ ముఖ్యమంత్రి'గా మారిపోయారని ఎద్దేవా చేశారు. అడవులు నరికే వీరప్పన్‌ను అటవీశాఖ మంత్రిని చేసినట్లుగా.. భూములు అమ్మే బ్రోకర్‌ను ముఖ్యమంత్రిని చేస్తే ఎలా ఉంటుందో అలా ఉందని రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.



మియాపూర్ భూములు అమ్మొద్దు, పేదలకు పంచివ్వండి: కేటీఆర్

మియాపూర్‌లోని 550 ఎకరాల ప్రభుత్వ భూమి వస్తే అమ్మేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆ భూములను అమ్మి సొమ్ము చేసుకోవాలని చూడకుండా, పేదలు, అమరవీరులు, ఉద్యమకారులకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హైదర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి తన అనుచరులతో కలిసి ఈరోజు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ... "మియాపూర్‌లోని 550 ఎకరాల్లో 200 ఎకరాలు పేదల ఇళ్లకు, 100 ఎకరాలు అమరవీరులకు, మరో 100 ఎకరాలు ఉద్యమకారులకు కేటాయించండి. మిగిలిన భూమిలో పాఠశాలలు, కాలేజీలు కడితే మనస్ఫూర్తిగా స్వాగతిస్తాం" అని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ఏడాదిలోపే కేసీఆర్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం వచ్చాక ఈ భూముల వ్యవహారాలపై దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లు ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇచ్చే చిత్తశుద్ధి ఉందా అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఎక్కడో 80 కిలోమీటర్ల దూరంలోని ఎర్రవెల్లిలో కాకుండా, హైదరాబాద్ నగర నడిబొడ్డున ఉన్న మియాపూర్‌లోనే అమరవీరులకు ఇళ్లు కట్టివ్వాలని సవాల్ విసిరారు. 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ' పేరుతో జరుగుతున్న స్కాంలో భాగస్వాములైతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని పారిశ్రామికవేత్తలను ఆయన హెచ్చరించారు.

కరవు కష్టాల నుంచి రైతన్నను గట్టెక్కించండి

-మొదటిపేజీ తరువాయి

పథకం కింద పనిదినాలను 200 రోజులకు పెంచాలని కోరారు. ఈ పథకాన్ని వ్యవసాయ పనులకు అనుసంధానించడం ద్వారా రైతులకు కూలీల కొరత తీరడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని సూచించారు. కరవు కారణంగా రైతుల ఆదాయం పూర్తిగా పడిపోయిందని, గతంలో తీవ్ర కరవు వచ్చినప్పుడు రాయలసీమలో పది ఎకరాల రైతులకు కూడా రేషన్ కార్డులు ఇచ్చి ఆదుకున్నామని గుర్తుచేశారు. అదే తరహాలో ప్రస్తుతం అర్హులైన కరవు బాధిత కుటుంబాలకు 'డ్రాట్ కార్డులు' జారీ చేసే అంశాన్ని పరిశీలించి, కేంద్ర సహకారంతో నిత్యావసరాలను సబ్సిడీపై అందించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు, రైతుల వ్యవసాయ రుణాలను రీషెడ్యూల్ చేసేందుకు కేంద్రం తోడ్పాటునందించాలని కోరారు.

జల్ జీవన్ మిషన్‌తో శాశ్వత పరిష్కారం

వర్షాభావంతో భూగర్భ జలమట్టాలు ప్రమాదకరంగా పడిపోయాయని, కొత్తగా ఎన్ని బోర్లు వేసినా నీళ్లు పడటం లేదని ముఖ్యమంత్రి తెలిపారు. కేవలం తాత్కాలిక నీటి సరఫరా చర్యలతో సరిపెట్టకుండా, శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఇందుకోసం 'జల్ జీవన్ మిషన్' (జేజేఎం) పథకాన్ని మరింత విస్తరించి, గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధి, అనుసంధానం వంటి పనులకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరారు. పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు పంటల బీమా పరిహారాన్ని త్వరగా అందించడం అత్యవసరమని అన్నారు. బీమా క్లెయిమ్‌ల పరిష్కారంలో జాప్యం లేకుండా, వీలైనంత త్వరగా పరిహారం రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా కేంద్రం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇది రైతులకు తదుపరి పంటకు పెట్టుబడిగా ఉపయోగపడుతుందని వివరించారు. ఈనెల 2, 3 తేదీల్లో కేంద్ర బృందం రెండు టీమ్‌లుగా విడిపోయి కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పర్యటించింది. క్షేత్రస్థాయిలో పంట నష్టాలను పరిశీలించి, రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ నివేదిక, తమ క్షేత్రస్థాయి పరిశీలనల ఆధారంగా 15 రోజుల్లో కేంద్రానికి సమగ్ర నివేదిక సమర్పిస్తామని ఐఎంసీటీ సభ్యులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అందించే సహాయంపై నిర్ణయం తీసుకోనుంది.

"డెమొక్రాట్లతో కలిసి పనిచేస్తా"



-మొదటిపేజీ తరువాయి

డెమోక్రాట్లు అంచనాలకు మించి ప్రతినిధుల సభ (హౌస్), సెనెట్ రెండింటినీ కైవసం చేసుకోవడంతో ట్రంప్ ఈ మేరకు దిగిరాక తప్పలేదు. ఎన్బీసీ న్యూస్ అంచనాల ప్రకారం, 435 స్థానాలున్న ప్రతినిధుల సభలో డెమోక్రాట్లు 256 సీట్లు గెలుచుకునే అవకాశం ఉంది. అదేవిధంగా, 100 మంది సభ్యులున్న సెనెట్‌లో కనీసం 54 స్థానాలు దక్కించుకుని స్పష్టమైన ఆధిక్యం ప్రదర్శించారు. ధరలు తగ్గిస్తానని, ప్రజల జీవితాలను సులభతరం చేస్తానని 2024 ఎన్నికల్లో ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన ట్రంప్, ఆ తర్వాత ఆ హామీలను పక్కనపెట్టారు. అమెరికాను గొప్పగా మార్చేందుకు టారిఫ్‌లు విధించడం, ఇరాన్‌లో ప్రభుత్వ మార్పు కోసం యుద్ధానికి దిగడం, వైట్‌హౌస్ సుందరీకరణ వంటి భారీ ప్రాజెక్టులపై దృష్టి సారించారు. ఇవే ఆయన పట్ల ప్రజాగ్రహానికి కారణమయ్యాయి. రిపబ్లికన్లకు కంచుకోటలైన టెక్సాస్, కాన్సాస్, దక్షిణ కరోలినా వంటి రాష్ట్రాల్లో పార్టీ ఓటమి పాలుకావడం ఆయన అంచనాలను తీవ్రంగా దెబ్బతీసింది. కాన్సాస్‌లో 95 ఏళ్ల రిపబ్లికన్ల గుత్తాధిపత్యానికి తెరదించుతూ డెమోక్రాట్ అభ్యర్థి ఆడమ్ హామిల్టన్ సెనెటర్‌గా గెలిచారు. టెక్సాస్ గవర్నర్‌గా హినా హినోజోసా ఎన్నికవడంతో 36 ఏళ్ల రిపబ్లికన్ పాలనకు ముగింపు పడింది. ట్రంప్ స్వయంగా ఎంపిక చేసిన అభ్యర్థులు సైతం ఓడిపోవడం ఆయనకు వ్యక్తిగతంగా పెద్ద ఎదురుదెబ్బ. ఈ ఓటమితో పార్టీపై ట్రంప్ పట్టు సడలుతుందని, ఆయనను వ్యతిరేకించే వారి సంఖ్య పెరుగుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అధ్యక్షుడిగా మిగిలిన రెండేళ్లలో ఆయన దూకుడుకు కళ్లెం పడుతుందని అంచనా వేస్తున్నారు. ఫలితాల తర్వాత 'పొలిటికో'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, "రెండేళ్ల పాటు ప్రతీదాన్నీ వీటో చేస్తూ కూర్చోవాలని నేను అనుకోవడం లేదు. దేశానికి మంచి జరిగేలా చూసేందుకు డెమోక్రాట్లతో కలిసి పనిచేస్తాం" అని తెలిపారు. అయితే, డెమోక్రాట్లు మాత్రం ఏమాత్రం తగ్గడం లేదు. ప్రతినిధుల సభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టనున్న హకీమ్ జెఫ్రీస్ మాట్లాడుతూ, "మేము కీలకమైన మార్పులు తీసుకురావాల్సి ఉంది. ఇప్పుడున్న వ్యవస్థలు సరిగా లేవు. అమెరికా ప్రజలకే ప్రాధాన్యత ఇచ్చే కాంగ్రెస్ కావాలి" అని స్పష్టం చేశారు. దీంతో రాబోయే రెండేళ్లలో ట్రంప్ పాలన ఎలా సాగుతుందనేది ఆసక్తికరంగా మారింది.

వర్షంలో విమానం ఎగరడం సురక్షితమేనా?

పైలట్ ఏం చెప్పాడంటే..!

వర్షంలోనూ విమాన ప్రయాణం సురక్షితమే
భరోసా ఇచ్చిన ఇండిగో పైలట్
టేకాఫ్, ల్యాండింగ్‌లో వైపర్ల వినియోగం
దృశ్యమానత పెంచే రెయిన్ రెపెల్లెంట్
మంచు పేరుకోకుండా యాంటీ ఐస్ టెక్నాలజీ



వర్షం పడుతున్నప్పుడు విమానంలో ప్రయాణించాలంటే చాలామందికి ఆందోళన కలుగుతుంది. బయట వాతావరణం సరిగా కనిపించకపోతే పైలట్లు విమానాన్ని ఎలా నడుపుతారు? భారీ వర్షంలో విమానం సురక్షితంగా ప్రయాణించగలదా? ఇలాంటి సందేహాలకు ఇండిగో పైలట్ కెప్టెన్ ప్రదీప్ కృష్ణన్ సమాధానమిచ్చారు. వర్షంలోనూ విమాన ప్రయాణం సురక్షితమేనని ఆయన భరోసా ఇచ్చారు. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న ఓ వీడియోలో.. వర్షం పడుతున్నప్పుడు విమానాన్ని నడిపేందుకు కాక్‌పిట్‌లో ఉపయోగించే ప్రత్యేక పరికరాల గురించి వివరించారు. బయట దృశ్యాలు స్పష్టంగా కనిపించకపోయినా.. విమానంలోని ఆధునిక పరికరాల సాయంతో పైలట్లు మార్గాన్ని గుర్తిస్తూ ప్రయాణాన్ని కొనసాగిస్తారని తెలిపారు.

వైపర్లు, రెయిన్ రిపెల్లెంట్

కార్లలో మాదిరిగానే విమానాల విండ్‌షీల్డ్‌పైనా వైపర్లు ఉంటాయి. వీటిని ప్రధానంగా టేకాఫ్, ల్యాండింగ్ సమయంలో ఉపయోగిస్తారు. వర్షపు నీరు కారణంగా పైలట్లకు ఎదురయ్యే ఇబ్బందిని తగ్గించేందుకు విండ్‌షీల్డ్‌పై ప్రత్యేకమైన రెయిన్ రిపెల్లెంట్ ద్రావణాన్ని పిచికారీ చేస్తారు. దీనివల్ల ముందు వైపు దృశ్యాలు మరింత స్పష్టంగా కనిపిస్తాయి.

వెదర్ రాడార్ కీలకం

విమానంలో ఉండే వెదర్ రాడార్.. ప్రయాణ మార్గంలో ఎదురయ్యే వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పైలట్లకు తెలియజేస్తుంది. వాతావరణ తీవ్రతను వేర్వేరు రంగుల ద్వారా సూచిస్తుంది. దీంతో ప్రమాదకర వాతావరణ పరిస్థితులను ముందుగానే గుర్తించి తగిన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది.

జారిపోకుండా యాంటీ స్కిడ్ వ్యవస్థ

వర్షం కారణంగా రన్‌వేపై నీరు నిలిచినప్పుడు విమానం చక్రాలు జారిపోయే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో విమానం అదుపు తప్పకుండా యాంటీ స్కిడ్ వ్యవస్థ తోడ్పడుతుంది. చక్రాలు నీటిపై తేలినట్లుగా మారి రన్‌వేతో పట్టును కోల్పోయే ఆక్వాప్లానింగ్ పరిస్థితిని నివారించడంలో ఇది సహాయపడుతుంది.

మంచు పేరుకోకుండా యాంటీ ఐస్

విమాన ప్రయాణంలో ఉష్ణోగ్రతలు బాగా తగ్గి మంచు పేరుకునే పరిస్థితులు ఎదురైనప్పుడు యాంటీ ఐస్ వ్యవస్థను ఉపయోగిస్తారు. విమానంలోని కీలక భాగాలపై మంచు ఏర్పడకుండా వేడి సాయంతో ఈ వ్యవస్థ పనిచేస్తుందని కెప్టెన్ వివరించారు. వర్షంలో విమాన ప్రయాణం సురక్షితమేనా అన్న ప్రశ్నకు కెప్టెన్ ప్రదీప్ కృష్ణన్.. కచ్చితంగా సురక్షితమేనని సమాధానమిచ్చారు. అయితే వాతావరణం తీవ్రంగా ప్రతికూలంగా ఉన్నప్పుడు భద్రతకు ప్రాధాన్యమిస్తూ విమానాల ఆలస్యం, దారి మళ్లింపు లేదా రద్దు వంటి నిర్ణయాలు తీసుకోవచ్చని విమానయాన నిపుణులు వివరిస్తున్నారు

స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభంజనం..

సీఎం చంద్రబాబును కలిసిన పల్లా

రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సాధించిన ఘన విజయంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నేడు ఆయన అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకే ప్రజలు మద్దతు పలికారన్నారు. విధ్వంసాలు, కుట్రలతో కూడిన తప్పుడు ప్రచారాలను ప్రజలు విశ్వసించరని ఈ తీర్పుతో స్పష్టమైందని ఆయన పేర్కొన్నారు. కూటమి విజయానికి కృషి చేసిన మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలకు, ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులకు పల్లా అభినందనలు తెలియజేశారు. ఈ ఎన్నికల ఫలితాలు తమపై మరింత బాధ్యతను పెంచాయని, మరింత వినయంతో, అంకితభావంతో పనిచేయాలనే సంకల్పాన్ని ఇచ్చాయని ఆయన వ్యాఖ్యానించారు.

ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి డబుల్ ధమాకా!



-మొదటిపేజీ తరువాయి

నిర్వహించిన మీడియా సమావేశంలో పొంగులేటి మాట్లాడారు. ఈ సందర్భంగా 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమ పోస్టర్‌ను ఇద్దరు మంత్రులు ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని పొంగులేటి తెలిపారు. తొలి విడతలో 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేయగా, ఇప్పటివరకు 2,21,500 ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తయ్యాయని వెల్లడించారు. మరో 1.90 లక్షల ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని వివరించారు. తొలి విడతలో 4.50 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లతో పాటు హైదరాబాద్ క్యూర్ ఏరియా పరిధిలో లక్ష ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ తరహాలోనే నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ కార్పొరేషన్లలోనూ జీం5 విధానంలో ఇందిరమ్మ టవర్లు నిర్మించనున్నట్లు ప్రకటించారు. ఈ నిర్మాణాలకు సంబంధించి దీపావళిలోగా నోటిఫికేషన్ జారీ చేస్తామని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్ల నుంచే వచ్చే ఏడాది బోనాల వేడుకలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.40 వేల కోట్ల వ్యయంతో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేసే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి ప్రతి సోమవారం నేరుగా నిధులు జమ చేస్తున్నామని, ఈ ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతోందని తెలిపారు. పట్టణాలు, గ్రామాలతో పాటు మారుమూల ప్రాంతాలు, తండాల్లోనూ ఇళ్ల నిర్మాణం కొనసాగుతోందన్నారు. దీపావళి సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో కలిసి పండుగ జరుపుకోవాలని పొంగులేటి కోరారు.

కండక్టర్ ప్రవళిక కుటుంబానికి

రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం



ప్రయాణికురాలి దాడిలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన టీజీఎస్ఆర్టీసీ మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక (24) కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ మేరకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం, ఆర్టీసీ తరఫున కలిపి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రవళిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ వద్ద ప్రవళిక మృతదేహానికి మంత్రి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రవళిక కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మిట్టగూడెం వద్ద అక్టోబర్ 25న ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. టికెట్ డబ్బుల చిల్లర విషయమై ప్రయాణికురాలు మౌనికతో జరిగిన గొడవలో... ప్రవళికను కదులుతున్న బస్సు నుంచి కిందకు తోసేయడంతో ఆమె వెనుక చక్రాల కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. పది రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నిన్న రాత్రి ఆమె కన్నుమూశారు. ఈ ఘటనపై ఇప్పటికే నిందితురాలైన ప్రయాణికురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సీమ వార్త సాయంకాలం
బుధవారం 4
నవంబర్ 2026

జేసీ నోట శాంతి మంత్రం – తాడిపత్రి రాజకీయాల్లో సరికొత్త వ్యూహం, ఫ్యాక్షన్ వద్దు ప్రశాంతత ముద్దు!

గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలకు బహిరంగ క్షమాపణ చెప్పిన జేసీ ప్రభాకర్ రెడ్డి

తాడిపత్రి నవంబర్ 4 సాయంకాలం: తాడిపత్రి నియోజకవర్గ రాజకీయాల్లో మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి సరికొత్త శాంతి మంత్రాన్ని జపిస్తున్నారు. ఫ్యాక్షన్ గొడవలకు ఫుల్ స్టాప్ పెట్టి, నియోజకవర్గంలో ప్రశాంతత నెలకొల్పడమే తన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.ఎబుధవారం తాడిపత్రిలో అయన నివాసంలో మీడియాతో మాట్లాడిన జేసీ ప్రభాకర్ రెడ్డి, తొలుత నియోజకవర్గంలోని గ్రామాల్లో ఉన్న రాజకీయ నాయకులు, కార్యకర్తలకు బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. గతంలో జరిగిన పరిణామాల వల్ల ఎవరైనా ఇబ్బంది పడి ఉంటే మన్నించాలని కోరారు. ముఖ్యంగా పుట్లూరు, ఎల్లనూరు మండలాల్లో రాజకీయ నాయకుల మధ్య కొనసాగుతున్న గొడవలు తగ్గాలని జేసీ ఆకాంక్షించారు. ఈ రెండు మండలాల్లో రాజకీయ వేడి ఎక్కువగా ఉందని, దీని వల్ల అభివృద్ధి కుంటుపడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

"మేము ఏసీల్లో, నష్టపోయేది మీరే":
"రాజకీయాల్లో నాయకులు భయపడితే ఎదగలేరు. కానీ గొడవల వల్ల నష్టపోయేది పై స్థాయి నాయకులు కాదు, కింది స్థాయి కార్యకర్తలే. మేము ఏసీ రూముల్లో హాయిగా ఉంటాం, కానీ గ్రామాల్లోని కార్యకర్తలు కేసుల్లో ఇరుక్కుని జీవితాలు నాశనం చేసుకుంటున్నారు" అని జేసీ కార్యకర్తలకు హితవు పలికారు. ఎన్నికల సమయంలో ఎవరూ గొడవలకు పాల్పడవద్దని, ప్రశాంతంగా ఉండాలని పిలుపునిచ్చారు.



11న గ్రామాల్లో పర్యటన:
గతంలో జరిగిన గొడవల్లో నష్టపోయిన కుటుంబాలను త్వరలోనే తాను స్వయంగా కలిసి పరామర్శిస్తానని తెలిపారు. ఈ నెల 11వ తేదీ నుంచి తాడిపత్రి నియోజకవర్గంలోని గ్రామాల్లో పర్యటించి, ప్రతి ఒక్కరినీ కలుస్తానని, గ్రామాలను ప్రశాంతంగా ఉంచడమే తమ లక్ష్యమని జేసీ ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు.

నేడు జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్

అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన ఎన్నికల యంత్రాంగం
శాంతియుత ఎన్నికలే మండల ప్రజల ఆకాంక్ష
అల్లర్లు సృష్టించే వారిపై పోలీసుల ప్రత్యేక నిఘా అవసరం

చెన్నేకొత్తపల్లి నవంబర్ 04, (సీమ వార్త): చెన్నేకొత్తపల్లి మండలంలోని ఒక జడ్ పి టీ సి అలాగే 13 ఎంపీటీసీ స్థానాల లోని 5 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి.ఇంకా మిగిలియున్నా ఒక జడ్ పి టీ సి అలాగే 8 ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్ జరగనుంది.ఇందులో మండలంలోని 15 గ్రామ పంచాయితీ పరిధిలో పురుష ఓటర్లు 18845 మంది అలాగే మహిళా ఓటర్లు 18512 మంది మహిళలు మొత్తం మండల వ్యాప్తంగా 45 పోలింగ్ కేంద్రాలలో 37358 మంది ఓటర్లు కలిగియున్నారు. నేడు జరుగనున్న ప్రజాస్వామ్య పండుగకు ఎన్నికల అధికారులు సర్వం సిద్ధము చేసారు. నేడు జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల ఎన్నికల పోలింగ్‌కు ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించారు. అయితే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు, ప్రలోభాలు, బెదిరింపులు లేకుండా స్వేచ్ఛాయుతంగా జరగడమే చెన్నేకొత్తపల్లి మండల ప్రజల ప్రధాన ఆకాంక్షగా కనిపిస్తోంది. రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది. అటువంటి పవిత్రమైన ఓటు హక్కును వినియోగించుకునే సమయంలో ఓటర్లకు ఎలాంటి ఆటంకాలు కలగకూడదు. రాజకీయ ఆధిపత్యం కోసం గొడవలకు దిగడం, ప్రత్యర్థులను భయపెట్టడం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం వంటి చర్యలకు ప్రజాస్వామ్యంలో స్థానం ఉండకూడదు అని మండల ఓటర్లు కోరుకుంటున్నారు. ఎన్నికల సమయంలో ప్రజా శాంతికి భంగం కలిగించే వ్యక్తులపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా వున్నదని అలాగే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపైనా, ఓటర్ల స్వేచ్ఛకు ఆటంకం కలిగించే వారిపైనా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని. అధికార, ప్రతిపక్ష పార్టీలనే తేడా లేకుండా ఎన్నికల నియమాలను ఉల్లంఘించే ప్రతి ఒక్కరిపైనా. ఎన్నికల అధికారులు, ప్రభుత్వ అధికారులు,పోలీసులు సమానంగా వ్యవహరించాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు. ఓటర్ల చేతిలోనే ప్రజాస్వామ్య భవిష్యత్తు ఆధార పడివున్నదని ఓటర్లు కుల, మత, ప్రాంతీయ రాజకీయాలకు, డబ్బు, మద్యం వంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రజా సమస్యలపై అవగాహన కలిగిన సమర్థులైన అభ్యర్థులను ఎన్నుకోవాలను



తమ ఓటును అమ్ముకోకుండా, ఎవరి ఒత్తిడికీ తలొగ్గకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని వీటికి అధికారులు ఓటర్లకు భద్రత కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఎన్నికలు నిర్వహించడం అధికారుల బాధ్యత అయితే, ప్రజాస్వామ్య విలువలను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత. ఓటు వేయడం కేవలం హక్కు మాత్రమే కాదు, సమాజ భవిష్యత్తును నిర్ణయించే బాధ్యత కూడా. అందుకే నేటి పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలని చెన్నేకొత్తపల్లి మండలంలోని మేధావులు, సామాజిక సంస్థర్తలు, విద్యావంతులు, జ్ఞాన వంతులు అలాగే ప్రజాస్వామ్యవాదులు ఆకాంక్షిస్తున్నారు.

మైనారిటీ ప్రాంతంలో బీజేపీకి పట్టం

25వ వార్డులో కూటమి అభ్యర్థి పోతుల గంగాధర్ యాదవ్ ఘన విజయం
343 ఓట్ల మెజారిటీతో అఖండ గెలుపు



తాడిపత్రి నవంబర్ 4 సాయంకాలం: తాడిపత్రి మున్సిపల్ ఎన్నికల్లో మైనారిటీలు అధికంగా ఉండే 25వ వార్డు ఫలితం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మైనారిటీ ఓటర్లు అధికంగా ఉన్న టైలర్స్ కాలనీ పరిధిలోని 25వ వార్డులో కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన భారతీయ జనతా పార్టీ అభ్యర్థి పోతుల గంగాధర్ యాదవ్ 343 ఓట్ల భారీ మెజారిటీతో ఘన విజయం సాధించారు.ఎతెలుగుదేశం, జనసేన పార్టీల మద్దతుతో బీజేపీ కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన ఆయనకు వార్డు ప్రజలు అఖండ మెజారిటీ కట్టబెట్టారు. అధికారిక ఫలితాల ప్రకారం గంగాధర్ యాదవ్ కు 764 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థికి 421 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఈ సందర్భంగా గంగాధర్ యాదవ్ మాట్లాడుతూ మైనారిటీ ప్రాంతంలో బీజేపీ అభ్యర్థిగా నాకు ప్రజలు ఇచ్చిన ఈ విజయం ఎంతో ప్రత్యేకం. ప్రజలు కుల, మత, పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టారు. బీజేపీ మైనారిటీలకు వ్యతిరేకమనే అపోహలను ప్రజలు పక్కన పెట్టారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి, కూటమిపై ప్రజలు ఉంచిన నమ్మకానికి నిదర్శనం" అని గంగాధర్ యాదవ్ పేర్కొన్నారు. తన విజయానికి సహకరించిన కూటమి పార్టీల నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యంగా తాడిపత్రి శాసనసభ్యుడు జేసీ అస్మిత్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

35వ వార్డు ప్రజలకు ధన్యవాదాలు తెలిపిన కేవీ రజాక్ – అభివృద్ధికే కృషి చేస్తానని హామీ



తాడిపత్రి నవంబర్ 4 సాయంకాలం: 35వ వార్డు నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన టీడీపీ అభ్యర్థి కేవీ రజాక్ వార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న 35వ వార్డులోని ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. పోటీ లేకుండా తనను గెలిపించడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. తన విజయానికి సహకరించిన ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. "నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయను. వార్డులోని ప్రతి సమస్యను పరిష్కరించడమే నా లక్ష్యం. మున్సిపల్ చైర్మన్ రేష్మా పర్వీన్ సహకారంతో వార్డును అన్ని విధాలా అభివృద్ధి చేస్తాను. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను" అని కేవీ రజాక్ హామీ ఇచ్చారు.

అనంతపురం మేయర్ పీఠంపై వైసీపీ జెండా – చిట్లూరు రమేష్ గౌడ్ కు ఫయాజ్ బాషా అభినందనలు



తాడిపత్రి నవంబర్ 4 సాయంకాలం: అనంతపురం నగర పాలక సంస్థ మేయర్ గా ఎన్నికైన వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకుడు చిట్లూరు రమేష్ గౌడ్ కు తాడిపత్రి పట్టణానికి చెందిన వైసీపీ రాష్ట్ర కార్యదర్శి హిరపురం ఫయాజ్ బాషా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.బుధవారం అనంతపురంలో మేయర్ చిట్లూరు రమేష్ గౌడ్ ను వైసీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఫయాజ్ బాషా మాట్లాడుతూ, పార్టీ కష్టకాలంలో కూడా పార్టీకి అండగా నిలబడిన నాయకుడు చిట్లూరు రమేష్ గౌడ్ అని కొనియాడారు. అలాంటి నాయకుడికి మేయర్ పదవి దక్కడం పార్టీ శ్రేణులందరికీ గర్వకారణమన్నారు.తనపై నమ్మకం ఉంచి మేయర్ గా అవకాశం కల్పించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి రమేష్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన అనుభవంతో, వైఎస్ జగన్ ఆశయాలకు అనుగుణంగా అనంతపురం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తారనే నమ్మకం తమకు ఉందన్నారు. నగర ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఫయాజ్ బాషా తెలిపారు. మేయర్ గా ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

జన సేన మున్సిపల్ చైర్మన్ మేకల ఈశ్వర్ కి ఘన స్వాగతం.

గోరంట్లకు విచ్చేసిన ఈశ్వర్ తో మండల జనసేన నాయకులు కలయిక.



గోరంట్ల నవంబర్ 4 సీమ వార్త సాయంత్రం.నిన్న జరిగిన పుట్టపర్తి మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున మున్సిపల్ చైర్మన్‌గా విజయం సాధించిన మేకల ఈశ్వర్ బుధవారం గోరంట్ల పట్టణానికి విచ్చేసిన సందర్భంగా గోరంట్ల జనసేన నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, పుట్టపర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేష్ జిల్లా ప్రోగ్రామింగ్ కమిటీ సభ్యులు పొగతోట వెంకటేష్ గోరంట్ల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఆహార పదార్థాలతో....సుస్థిర జీవన శైలి..!!

-మొదటిపేజీ తరువాయి

ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ పరిరక్షణ, సుస్థిర జీవన విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమానికి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ , జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సహకారం అందించాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆహారం, పోషణ, ఆరోగ్యం, పారిశుధ్యం, లింగ సమానత్వం తదితర అంశాలపై అవగాహన పెంపొందించడంతో పాటు న్యూట్రి గార్డెన్స్, న్యూట్రి ఎంటర్‌ప్రైజెస్, గానుగ నూనెల తయారీ కేంద్రాలు, సర్క్యులర్ ఎకానమీ యూనిట్లు, బయో రిసోర్స్ ఆధారిత కార్యక్రమాల ద్వారా సుస్థిర జీవన విధానాలను ప్రోత్సహిస్తున్నారు. ఏడు రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నవంబర్ 4వ తేదీన "సుస్థిర ఆహార విధానాలను అవలంబిద్దాం" అనే అంశంపై ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా 10 నుంచి 12 రకాల సేంద్రియ ఆహార ఉత్పత్తులు, పౌష్టికాహార పదార్థాలు, చిరుధాన్యాల ఆధారిత ఆహార ఉత్పత్తులు, చిరుధాన్యాల ప్రాసెసింగ్ ఉత్పత్తులు, సేంద్రియ గానుగ నూనెలు, ఫుడ్ బాస్కెట్లు తదితర ఉత్పత్తులను ప్రదర్శించి, వాటి వినియోగం, ఆరోగ్య ప్రయోజనాలు మరియు పర్యావరణానికి కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా ఆయా ఉత్పత్తుల విక్రయాలను కూడా నిర్వహించారు.ప్రజలు సేంద్రియ ఆహార పదార్థాలు, చిరుధాన్యాలను తమ రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవాలని, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని, పర్యావరణ పరిరక్షణకు దోహదపడే సుస్థిర జీవన విధానాలను పాటించాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ శశికళ, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నరసయ్య, స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులు, మహిళా పారిశ్రామికవేత్తలు, సంబంధిత అధికారులు మరియు ఇతర భాగస్వాములు పాల్గొన్నారు.

జనం మెచ్చిన విజేతలకు జేజేలు..!!

-మొదటిపేజీ తరువాయి



కూటమి ప్రభుత్వం నుండి 24 మంది బీజేపీ నుండి 1 ఇండిపెండెన్స్ 3 కౌన్సిలర్స్ అఖండ మెజార్టీతో గెలుపొందారు కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూసి ఇండిపెండెన్స్ గా గెలుపొందిన 3 కౌన్సిలర్స్ కూటమి ప్రభుత్వంతో చేరడంతో చాలా సంతోషకరంగా ఉందని తెలిపారు.ఈ సందర్భంగా గెలిచిన గుంతకల్లు చైర్మన్ మరియు కౌన్సిలర్లు మాట్లాడుతూ గుంతకల్లు నియోజకవర్గ శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం మరియు వారి సోదరుడు గుంతకల్లు మండల ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి మరియు కూటమి నాయకులకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు శాలువా కప్పి పూలమాల వేసి ఘనంగా సత్కరించి మిఠాయిలు పంచుకోవడం జరిగింది.ఈ సందర్భంగా గుంతకల్లు చైర్మన్ శ్రీమతి యశోద మాట్లాడుతూ నన్ను ఆదరించి 6557 ఓట్ల అఖండ మెజార్టీతో గెలిపించిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కి మరియు గుంతకల్లు పట్టణ కూటమి ప్రభుత్వం నాయకులకు కార్యకర్తలకు గుంతకల్లు ప్రజలకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేస్తున్నాను అలాగే పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ కూటమి గెలుపొందిందని వారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కి అభినందించడం జరిగింది.అదే విధంగా రాబోయే పంచాయతీ ఎన్నికలలో కూడా ఖచ్చితంగా కూటమి ప్రభుత్వం మార్క్ రాజకీయం చూపించి చంద్రబాబు నాయుడు గారికి గిఫ్ట్ గా అందిస్తామని వారు తెలియజేశారు...ఈ కార్యక్రమంలో గుంతకల్లు పట్టణ కౌన్సిలర్లు మరియు గుంతకల్లు పట్టణ మరియు మండల కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

రేపు జడ్పీటీసీ,ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్

అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన ఎన్నికల యంత్రాంగం
గట్టి బందోబస్తు ఏర్పాటు చేసిన ఎస్ఐ సుధాకర్ యాదవ్



సోమందేపల్లి నవంబర్ 4 సీమ వార్త సాయంకాలం సోమందేపల్లి మండలం లో రేపు ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల పోరుకు ఎస్ఐ సుధాకర్ యాదవ్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జడ్పిటిసి ఎంపిటిసి స్థానాల ఎన్నికల పోలింగ్ ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్ళు రోపాలెం బెదిరింపులు లేకుండా స్వేచ్ఛాయుతంగా ప్రశాంత వాతావరణంలో ప్రతి పౌరుడు ఓటు హక్కు వినియోగించుకోవాలని ఓటర్లకు అధికారులు పిలుపునిచ్చారు.

టీడీపీలోకి చేరిన రంగేపల్లి వైసీపీ ప్రముఖ సీనియర్ నాయకులు



సోమందేపల్లి నవంబర్ 4 సీమ వార్త సాయంకాలం మండల కేంద్రంలోని రంగేపల్లి గ్రామానికి చెందిన 20 కుటుంబాలు వైసీపీ కార్యకర్తలు రాష్ట్ర నగర ఉప్పర కార్పొరేషన్ ఛైర్మన్ రంగేపల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో టీడీపీ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో సోమశేఖర్,అంజినప్ప, షేటప్ప మరియు 20 కుటుంబాలకు టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి సవితమ్మ ఆధ్వర్యంలో మరియు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి పెనుకొండ నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులమై టీడీపీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపి నాయకులు చెన్నాపురం అంజి,కొత్తపల్లి శేషప్ప, హనుమంతు,జేసీబీ అరవింద్,ఇటుకల చంద్ర, రవి, డైరీ అంజి, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881